అగస్త్యేశ్వరా.. పాహిమాం !

- పాతగుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయ చరిత్ర అపూర్వం
- త్రేతాయుగం నుంచే ఇక్కడ పూజలు జరుగుతున్నట్లు స్థల పురాణం
- మహాశివరాత్రి సందర్భంగా చురుగ్గా ఏర్పాట్లు

పట్నంబజారు: ఈశ్వరం సర్వ విద్యానం..ఈశ్వరం సర్వ భూతానం..బ్రహ్మాధిపతి..బ్రహ్మోధిపతి బ్రహ్మ.. శివోమి అస్తు శివోం.. సృష్టికి మూలం ఆ పరమేశ్వరుడు.. సర్వ జగత్ లయకారుడై.. భక్తులను చల్లని చూపు చూస్తాడు. ఓం నమః శివాయ అనే ఒక్క పదం సనాతన ధర్మంలోనే.. ప్రతి ఒక్కరికి సర్వ జగద్రక్ష అని ఎంతో మంది వేద పండితులు.. మహానీయుల ఉద్ఘాటిస్తుంటారు. అందుకే అత్యంత పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులతో శైవ క్షేత్రాలన్ని కిటకిటలాడుతాయి.

అతిపురాతన శివాలయం..

గుంటూరు నగరంలోని పాతగుంటూరులో వేంచేసియున్న శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి (శివాలయం) ఆలయానికి ఎంతో విశేషమైన చరిత్ర ఉంది. గుంటూరులోనే అతిపురాతన ఆలయంగా పేరుంది. త్రేతాయుగంనుంచి భక్తుల విశేష పూజలు అందుకుంటున్న బ్రహ్మసూత్ర అగస్త్యేశ్వరుడి ఘనచరిత్ర అమోఘం. త్రేతాయుగంలో ఇప్పటి గుంటూరు అప్పుడు గర్తపురిగా పిలవపడేది. ఆ యుగంలో తన యాత్రలో భాగంగా అగస్త్యేశ్వర మహాముని గర్తపురికి విచ్చేశారు. ఈ క్రమంలో ఆయన శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ఆయన(శివలింగాన్ని) ప్రతిష్ఠించారు. దానిలో భాగంగానే ఇక్కడ ప్రతిష్ఠించిన ఆ పరమేశ్వరుడు అగస్త్యేశ్వరుడిగా పిలవబడుతూ పూజలు అందుకుంటున్నారు.



పాతగుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం

శైవాగమ పద్ధతిలో పూజాది కార్యక్రమాలు

ఆదేవిధంగా క్రీ.శ.1158 సంవత్సరంలో పరిచ్ఛేది పండ్రయ రాజు, అగస్త్యేశ్వరుడి శివలింగాన్ని పునః ప్రతిష్ఠించినట్లు ఆలయ ప్రాంగణంలోని నాగశిల శాసనం ప్రకారం తెలియవస్తోంది. ఆ రాజుకాలంలోనే ఆలయ ప్రధాన భాగంతో పాటు, మండపం, గోపురం, గుడిని నిర్మించారని శాసనం చెబుతోంది. ఆలయంలో అగస్త్యేశ్వరుడితో పాటు శ్రీగంగా పార్వతిలు మూల విరాట్టుగా పూజలు అందుకుంటున్నారు. కాలక్రమేణా ఈ ఆలయంలో ఏకాంబరేశ్వరుడి సమేత కంచి కామాక్షి అమ్మవారి ఆలయం, వినాయకుడు, వీరభద్రుడు, ఆది శంకరాచార్యులు, నవగ్రహాల మండపం, అయ్యప్పస్వామి ఆలయం భక్తుల చేత ప్రతిష్ఠింపబడ్డాయి. ఆలయంలో నిత్యం శైవాగమ విధానంలో పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయి. అలాగే నల్లరాతి శాసనం ప్రకారం క్రీ.శ.1779 సంవత్సరంలో చెవిటికంటి వెంకన్న కుమారుడు రాముడు కల్యాణమండపం కట్టించి, ప్రతి మార్గశిర మాసం, బహుళ పక్షం నాడు



అగస్త్యేశ్వర మహాముని ప్రతిష్ఠించిన శివలింగం

స్వామివారి కల్యాణం జరిపించారని తెలుస్తోంది. అదే ఇప్పటికీ ఆచారంగా కొనసాగుతోంది. మహాశివరాత్రి, దసరా నవరాత్రులు, కార్తిక మాసంలో దేవస్థానంలో మహన్యాసకపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సౌమ్య జాగ్రత్తలు తీసుకుంటున్నారు. క్యూలైన్లు, భక్తుల కోసం టెంట్లు, తాగునీటి సౌకర్యం, ప్రసాద ఏర్పాటు, పూజా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. శివరాత్రి రోజున పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలిరానున్నారు.

ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

పట్నంబజారు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత గుంటూరులో వేంచేసియున్న శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 26వ తేదీ శివరాత్రిని పురస్కరించుకుని 24వ తేదీ ఉదయం స్వామివారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేయనున్నారు. అదే రోజు సాయంత్రం గణపతి పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, వాస్తుశాంతి, అగ్ని ప్రతిష్ఠాపన, త్రిశూలాచర్చన, ధ్వజారోహణ నిర్వహించనున్నారు. 25వ తేదీ నిత్యొపాసన, నిత్యబలిహరణ, రుద్రహోమం, పరివారదేవతా హోమాన్ని నిర్వహించి, సాయంత్రం ప్రదోషకాలార్చన చేయనున్నారు. 26వ తేదీ శివరాత్రి రోజున తెల్లవారుఝాము నుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, నిత్యఅర్చనలు, రుద్రహోమం, మధ్యాహ్నం 2గంటలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 10.30గంటల నుంచి లింగోద్భవకాల మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రాత్రి 1గంటకు స్వామివారికి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం, 27వ తేదీ సాయంత్రం స్వామివారి దివ్య రథోత్సవం, 28వ తేదీన పూర్ణాహుతి, కుట్టోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణిలు, మార్చి 1వ తేదీన స్వామివారు, అమ్మవార్లకు పవళింపు సేవ కార్యక్రమంతో మహాశివరాత్రి కార్యక్రమాలు ముగుస్తాయి, దీనితో పాటు ఐదు రోజుల పాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి

క్లుప్తంగా

మురుగు.. రోడ్లపై పరుగు



వీరనాయకునిపాలెం (చేబ్రోలు): మురుగునీటి కాలువలు సక్రమంగా ప్రవహించకపోవటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం గ్రామస్థులకు శాపంగా మారింది. చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గత కొద్ది రోజులుగా ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోవటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న సైడ్ డ్రెయిన్‌లో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. పంచాయతీ ఆఫీసు రోడ్డు పక్కన ఉన్న సైడ్ డ్రెయిన్ మురుగునీరు దిగువకు ప్రవహించకుండా మధ్యలో అడ్డువేయటంతో మురుగు సిమెంట్ రహదారిపైకి ప్రవహిస్తుంది. ఈ రహదారిపై రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. ఇకనైనా సంబంధిత మండల, పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



గుంటూరు రూరల్: నెలనెలా అన్నసంతర్పణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ఆధ్వర్యంలో మండలంలోని ఏటుకూరు గ్రామం అనంతవరప్పాడు రోడ్డులోగల మమ్మీ డాడీ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అశ్రమంలోని 60 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య, క్లబ్ సభ్యులు లయన్ యరసాని కోటేశ్వరరావు, తాడికొండ ఎంఈఓ ధూపాటి ప్రభాకరరావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

పొన్నూరు: మండల కెమిస్ట్, డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ నిర్వహణలో పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన రక్తనాళాల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శిబిరంలో హాస్పిటల్ వైద్యులు ధమనుల వ్యాధులు, సిరల పుండ్లు, డయాబెటిక్ పాదం వంటి రోగాలకు సంబంధించిన పరీక్షలను రోగులకు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు, కార్యదర్శి ఎల్.మోహనకృష్ణ, కోశాధికారి తాతా హరీష్, సభ్యులు పర్యవేక్షించారు.

సంత్ గాడ్గే బాబాకి భారతరత్న ఇవ్వాలి

ఏపీ రజక జనసేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి



నెహ్రూనగర్: స్వచ్ఛ భారత్ సృష్టికర్త, విద్యాదాత, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మేధావి సంత్ గాడ్గే బాబా అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం సంత్ గాడ్గే బాబా జయంతిని పురస్కరించుకొని యానాది కాలనీ సెంటర్‌లో సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాడ్గే బాబా చదువులేని వారికి చదువు చెప్పించడం, ఇల్లు లేని వారికి ఇల్లు కట్టించటం, గుడ్డివారికి కుంటి వాళ్లకు రోగులకు మందులు ఇప్పించటం, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం, అణగదొక్కబడ్డ కులాల వారిని ప్రోత్సహించటం, పేద విద్యార్థులు, బాలికలకు వివాహాలు చేయడం, తదితర పదిసూత్రాలు గాడ్గే బాబా తను ట్రస్టు ద్వారా సహాయం చేసి, సమాజ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. వివిధ సంఘాల నాయకులు నాగసముద్రం పరమేశ్వర రావు, తాటికొండ నరసింహారావు, డెన్నిస్ రాయ్, ఈమని ఉమామహేశ్వర, వట్టికూటి సాంబయ్య పాల్గొన్నారు.

విశ్రాంత తహసీల్దార్ భీమా మాణిక్యరావు మృతి

లక్ష్మీపురం: జిల్లా రెవెన్యూ శాఖలో 38 సంవత్సరాలకు పైగా వివిధ హోదాల్లో పనిచేసి రెవెన్యూ ఉద్యోగ సంఘ నాయకునిగా అనేక సేవలు అందించిన విశ్రాంత తహసీల్దార్ భీమా మాణిక్యరావు(90) శనివారం స్థానిక ఎన్జీఓ కాలనీలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య ధనలక్ష్మి, కుమారుడు నాగేశ్వరరావు ఉన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని శ్రీయోగదా చారిటబుల్ ట్రస్ట్ వివిధ పాఠశాలల్లో 5వ తరగతి విద్యార్థులకు సైన్స్, గణితంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘం సహకారంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తితోపాటు ఆలోచనాశక్తి, పరిసరాలను గమనించే నైపుణ్యాలను ప్రోత్సహించే విధంగా నిర్వహించినట్లు ట్రస్టు కార్యదర్శి డాక్టర్ బి.రాఘవరావు తెలిపారు. ఏడు పాఠశాలల నుంచి 52 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, వారిలో ప్రొఫెసర్ ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్, శ్రీరామకృష్ణ శారదా విద్యాలయ, శ్రీఅరవింద స్కూల్ విద్యార్థులు వరుసగా తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ఆలోచన శక్తిని ప్రోత్సహించే విధంగా రూబిక్స్ క్యూబ్‌లు బహుమతిగా అందజేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గుంటూరు రూరల్: నెలనెలా అన్నసంతర్పణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ఆధ్వర్యంలో మండలంలోని ఏటుకూరు గ్రామం అనంతవరప్పాడు రోడ్డులోగల మమ్మీ డాడీ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అశ్రమంలోని 60 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య, క్లబ్ సభ్యులు లయన్ యరసాని కోటేశ్వరరావు, తాడికొండ ఎంఈఓ ధూపాటి ప్రభాకరరావు కుటుంబ సమేతంగా తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో స్వచ్ఛ గ్రామాలు సాధ్యం



ములుకుదురులో కరపత్రాలు అందిస్తున్న ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు



మాచవరంలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు

పొన్నూరు: గ్రామాల్లో ఇంటి పరిసరాల వద్ద పరిశుభ్రత పాటించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని పొన్నూరు మండల విస్తరణాధికారి మల్లికార్జునరావు అన్నారు. పంచాయతీ కమిషనర్ ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మండలంలోని చింతలపూడి, మాచవరం, ములుకుదురు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. వీధుల్లో పేరుకున్న చెత్తను తొలగించి శుభ్రత పాటించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు తడి చెత్త, పొడి చెత్త విభజనతో పంచాయతీకి పెరిగే ఆదాయం, కంపోస్టుతో కలిగే ప్రయోజనంపై వివరించారు. రోడ్లపై చెత్తను వేయరాదని. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రజలకు సూచించారు. పంచాయతీ వాహనాల్లో మాత్రమే చెత్తను వేయాలని తెలిపారు. పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలపై కరపత్రాలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ వ్యవస్థాపక దినోత్సవం

కాకుమాను: కేవలం నలుగురు వ్యక్తులతో స్థాపించిన రోటరీ క్లబ్ నేడు ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని పెదనందిపాడు రోటరీ క్లబ్ కార్యదర్శి ఎస్.వి.ఎస్.నాగేశ్వరరావు అన్నారు. పెదనందిపాడు అశోక పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ 1905, ఫిబ్రవరి 23వ తేదీన పాల్ హారీస్ అనే మహనీయుడు రోటరీ క్లబ్‌ను నలుగురు వ్యక్తులతో స్థాపించినట్లు ఆయన తెలిపారు. తాము క్లబ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన, పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక సహాయంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా పాల్ హారీస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ కోశాధికారి కోడూరి నాగేశ్వరరావు, డైరెక్టర్ పి.లక్ష్మీనారాయణ, విద్యార్థులు ఉన్నారు.



పాల్ హారీస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

పొన్నూరు: భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘ బోర్డును పునరుద్ధరిస్తామని కార్మికులకు హామీఇచ్చి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. పెయింటింగ్ వర్కర్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు గుమ్మడి రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గుంటూరు ఏడుకొండలు, ప్లంబింగ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కంచర్ల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోశయ్య

నీటి నాణ్యత, సరఫరా వ్యవస్థపై అవగాహన

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామంలో వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలో మహిళలకు నీటి నాణ్యత పరీక్షల నిర్వహణ, నీటి సరఫరాపై అంచనాలపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ ఎయిడ్ గుంటూరు జిల్లా ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ నీటి వనరుల ద్వారా సరఫరా అవుతున్న నీరు వివిధ కారణాలవల్ల కలుషితం, వ్యర్థమవడం జరుగుతుందన్నారు. దీని ద్వారా గ్రామ ప్రజలు వివిధ రోగాలకు, నీటి ఎద్దడికి గురవుతున్నారన్నారు. ఈ సమస్యను రూపుమాపేందుకు పూర్తిస్థాయిలో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించడం, నీటి సరఫరా వ్యవస్థను అంచనా వేయడం మహిళలకు క్రమంగా నేర్పించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలోని మహిళలు నీరు పారిశుధ్యం, పరిశుభ్రత విభాగంలో సాధికారత సాధిస్తారని తెలియజేశారు. ప్రాజెక్ట్ అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సురేష్

ఈ-శ్రమలో సభ్యులుగా చేరాలి



లక్ష్మీపురం: నగరంలోని కార్మికవర్గం యావత్తు ఈ-శ్రమ స్కీంలో సభ్యులుగా భాగ్యస్వాములు కావాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి కోరారు. స్థానిక నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం రేగుల రాఘవయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన ఈ-శ్రమ స్కీంలో సభ్యులుగా నమోదయ్యేందుకు ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ స్కీముని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. తద్వారా కార్మికులకు రూ.2లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని తెలిపారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, నగర ఉపాధ్యక్షులు చల్లా మరియదాసు, టి.శ్రీనివాసరావు, ఐరన్ విభాగం అధ్యక్షుడు పప్పుల రోసి రెడ్డి ముఠా కార్మిక సంఘం కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



పెదకాకాని: ప్రజల హక్కుల కోసం, బలహీన వర్గాలకు సత్వర న్యాయ సహాయం కోసం ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర కమిటీలో నూతనంగా నియమితులైన వారు నిర్విరామంగా కృషి చేయాలని ఏపీ హైకోర్టు న్యాయవాది నంబూరు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని నంబూరు విజయభాస్కర్ నగర్‌లో ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర కమిటీలో భాగమైన అవినీతి నిరోధక విభాగం రాష్ట్ర అడ్వైజర్‌గా, గుంటూరు జిల్లా ఇన్‌చార్జిగా ఎం.సుబ్బారావు, మానవ హక్కుల పరిరక్షణ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కట్టిపోగు నాగేశ్వరరావు నియమితులైన సందర్భంగా అభినందన సభ జరిగింది. సభకు నంబూరు సాంబయ్య అధ్యక్షత వహించారు. న్యాయవాదులు, ఉద్యోగులు, మేధావులు ఈ సంఘాల్లో పనిచేస్తున్నారని అందరూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నంబూరు సాల్మన్, యోహాన్, రత్న కిషోర్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహనరావు

కాకుమాను: ప్రభుత్వాలు మారుతున్న రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని గత అనేక సంవత్సరాల నుంచి గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని అనేక ఉద్యమాలు చేసిన ఫలితం లేదని నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహనరావు అన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య మెమోరియల్ లైబ్రరీలో ఆదివారం గుంటూరు ఛానల్ పొడిగింపుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజమోహనరావు మాట్లాడుతూ గత 85 సంవత్సరాల నుంచి గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని అనేకమార్లు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా నేటివరకు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన తెలిపారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో గుంటూరు ఛానల్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఛానల్‌ను పొడిగించడం వలన అనేక గ్రామాలకు తాగు,సాగు నీరు సకాలంలో అందుతాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని ఏ పంటకు సరైన గిట్టుబాటు ధరలేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రైతులు రోడ్డెక్కవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. యార్లగడ్డ అంకమ్మ చౌదరి, ప్రొఫెసర్ కారుమంచి విజయ్ కుమార్, లావు అంకమ్మ చౌదరి, కొల్లా నిర్మల, ఈదర భ్రమరాంబ, లావు చౌడేశ్వరి, నాయుడు సుబ్బారావు, దివి ప్రమీల, గోవాడ సత్యన్నారయణ, కొల్లా వీర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లా రాజమోహనరావు

ప్రజలకు మీరేం చేశారో చెప్పండి

కూటమి నేతలను ప్రశ్నించిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యమ నేపథ్యం కలిగిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీలుగా తాము అధికారపార్టీ తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు వేలెత్తి చూపించే స్థితిలో లేమని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఉన్న తాను పీడీఎఫ్ తరపున మరోసారి ఉద్యోగ, ఉపాధ్యాయ, రైతు, కార్మిక, పెన్షనర్ సంఘాల మద్దతుతో బరిలో నిలిచినట్లు చెప్పారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేసుకుని తాము శాసన మండలి లోపల, వెలుపల పోరాటాలు చేశామన్నారు. కూటమి తరపున పోటీలో ఉన్న అభ్యర్థి గత మూడు రోజులుగా తనపై వ్యక్తిగతంగా దుష్ప్రచారాన్ని సాగిస్తున్నారని, ప్రజా స్వామ్యంలో ఇది అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ధైర్యం ఉంటే విధానాల ప్రాతిపాదికన పోరాడాలన్నారు. ప్రజలకు మీరేం చేశారో చెప్పాలని, మేము ఏమి చేశామో చెబుతామని ఘాటుగా స్పందించారు. తప్పుడు విమర్శలను విజ్ఞులైన ఓటర్లు గమనిస్తూనే ఉంటారని అన్నారు. ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని సంఘాల మద్దతుతో మరోసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో నిలిచిన తాను ప్రజల పక్షాన నిలిచి, శాసనమండలిలో గళం విన్పిస్తానని చెప్పారు. గ్రూప్–2 పరీక్ష నిర్వహణలో ప్రభుత్వం అనేక తప్పిదాలు చేసిందని కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. రోస్టర్ విధానాన్ని సవరించకుండా పరీక్ష నిర్వహించడం సరికాదని, భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎం. హనుమంతరావు, జేవీవీ నాయకుడు టి.జాన్‌బాబు, విశ్రాంత ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నాయకుడు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

మూఢ నమ్మకాలు రూపు మాపేందుకు మేజిక్ దోహదం

నగరంపాలెం: మేజిక్‌తో మూఢ నమ్మకాలను తరిమికొట్టవచ్చునని ప్రముఖ మెజిషియన్ వీవీ రమణ అన్నారు. స్థానిక నాజ్‌సెంటర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేజిక్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మేజిక్ దినోత్సవం, అంతర్జాతీయ మెజిషియన్ పి.సి. సర్కార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీవీ రమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలను పారదోలేందుకు మేజిక్ ఉపయోగపడుతుందని అన్నారు. మేజిక్ వల్ల చిన్నారుల్లో ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. మెజిషియన్‌లు శ్రీనివాస్, కోటేశ్వరరావు, లక్ష్మి, సునంద పాల్గొన్నారు.

అన్నమయ్య గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

లక్ష్మీపురం: సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగ విరమణ చేసి, గుంటూరులో అన్నమయ్య గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న లంకా సూర్యనారాయణకు మార్కెట్లోకి రాని రెండు సినిమా పుస్తకాలను సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం బహూకరించింది. ఆదివారం బృందావన్ గార్డెన్స్ లోని అన్నమయ్య గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘ నేత గుమ్మడి సీతారామయ్య చౌదరి ఆధ్వర్యంలో ఎన్.టి.ఆర్, ఎల్.విజయలక్ష్మిలపై ప్రచురించిన నూతన పుస్తకాలను గ్రంథాలయానికి అందచేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ నేతలు టి.వివేకానంద, జి.సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ ఎన్.టి.ఆర్ అరుదైన ఫొటోలు, నేటి తరానికి తెలియని ఎల్.విజయలక్ష్మి సినీ జీవిత గాథ ఈ పుస్తకాల ప్రత్యేకత అన్నారు. పుస్తక రూపకర్తలు చిన్ని శ్రీను (రాజమండ్రి), కంపల్లె రవిచంద్రన్ (తిరుపతి) కోరిక మేరకు పుస్తక తొలి ప్రతులను అన్నమయ్య గ్రంథాలయానికి అందజేస్తున్నామన్నారు. అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.